క్లుప్తంగా

ఆసుపత్రుల్లో నిబంధనలు పాటించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి విల్సన్

సామర్లకోట: ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ విల్సన్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక రత్నం రాజు ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు తరచూ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నామన్నారు. ఆరోపణలు ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులపై దృష్టి సారిస్తామని చెప్పారు. స్థానిక ఆస్పత్రిలో కొన్ని లోపాలను గుర్తించామని, వాటిని సవరించుకోవాలని సూచించామన్నారు. ఆసుపత్రుల్లో అగ్నిమాపక అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తయారు చేద్దాం



చంద్రంపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రామ్మోహనరావు

సామర్లకోట: ప్రతి గ్రామాన్ని సారా రహితంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహనరావు అన్నారు. గురువారం చంద్రంపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నాటు సారా తయారు చేసే వారు తమ వ్యాపారాలకు స్వస్తి చెప్పాలన్నారు. అటువంటి వారికి వారి జీవనోపాధిని మెరుగుపర్చుకునే విధంగా వివిధ శాఖల సమన్వయంతో వ్యాపారాలు చేసుకోవడానికి సహకారం అందిస్తామన్నారు. చంద్రంపాలెం గ్రామాన్ని సారా రహితంగా ప్రకటిస్తున్నామని, దానికి అంతా సహకరించాలన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ సీమల భవానీ అధ్యక్షత వహించగా, ఎక్సైజ్ ఎస్సై ఎంవీవీబీ కుమార్, వీఆర్వో ఎస్.పద్మనాభం, పంచాయతీ కార్యదర్శి పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని సత్రం షాపు స్వాధీనం

బోట్‌క్లబ్: స్థానిక పెద్ద మార్కెట్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రానికి చెందిన షాపును గురువారం దేవదాయ శాఖ అధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. షాపు లీజును ఆరు నెలలుగా చెల్లించకపోవడంతో దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం షాపును స్వాధీనం చేసుకున్నట్లు సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మొత్తం రూ. 1. 08 లక్షలు చెల్లించాల్సి ఉండగా, సదరు వ్యక్తి షాపునకు తాళం వేసి, అద్దె చెల్లించడం లేదన్నారు. దేవదాయ నిబంధనల ప్రకారం షాపు స్వాధీనం చేసుకుని, అద్దె చెల్లించని వ్యక్తికి లీగల్ నోటీసులు జారీ చేస్తామన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్, త్రీ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

కరప: స్థానిక విష్ణాలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ కె.తిరుమల రవితేజ తెలిపారు. ఆలయంలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామివార్లకు ఉదయం పంచామృతాభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలు ఉంటాయని ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. జెడ్.భావారం, పెనుగుదురు, కూరాడ తదితర గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ముంపునకు గేట్లెత్తేశారు!

- వేట్లపాలెంలో సర్‌ప్లస్ వియర్ గేట్ల ఎత్తివేత
- వీకే రాయపురంలో పంట పొలాల్లోకి నీరు
- తరచూ ఇదే పరిస్థితి



వేట్లపాలెం సర్‌ప్లస్ వియర్ నుంచి పొలాల వైపు వస్తున్న నీటి ప్రవాహం



వీకే రాయపురంలో నీట మునిగిన పంట పొలాలు

సామర్లకోట: నిర్లక్ష్యం నిండా ముంచుతోంది.. తరచూ సమస్య ఉత్పన్నమవుతున్నా ఎవరికీ పట్టింపు లేకుండి.. వీకే రాయపురం గ్రామంలో పంట భూములు ముంపునకు గురవుతున్నా శాశ్వత పరిష్కారం కానరాకుంది. ప్రకృతి విపత్తుల కారణంగా పంట భూములు ముంపునకు గురైతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం లభిస్తుంది. మానవ తప్పిదాలతో పొలాలు ముంపు బారిన పడితే ఏంటనే ప్రశ్న రైతుల నుంచి వినిపిస్తుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట భూముల్లో నీరు చేరింది. దీనికితోడు ఎగువ ప్రాంతం నుంచి నీరు రావడంతో వీకే రాయపురంలోని పంట భూములు చెరువుల్లా మారాయి. గోదావరి కాలువలో నీటిమట్టం ఎక్కువగా ఉన్న సమయంలో ఆ నీరు సముద్రంలోకి వెళ్లే విధంగా బిక్కవోలు, వేట్లపాలెం గ్రామాల్లోని గోదావరి కాలువ గట్లపై సర్‌ప్లస్ వియర్ గేట్లు ఏర్పాటు చేశారు. అయితే మాటిమాటికీ వేట్లపాలెంలోని సర్‌ప్లస్ వియర్ గేట్లు ఎత్తి వేయడంతో పంట భూముల్లోకి నీరు చేరి వరి నాట్లు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నుంచి వేట్లపాలెంలోని సర్‌ప్లస్ వియర్ గేట్లు ఎత్తివేయడం వల్ల నీరు వచ్చి పంటలను ముంచేసిందని లబోదిబోమంటున్నారు. గోదావరి కాలువలో నీటిమట్టం ఎక్కువగా లేకపోయినా ఎందుకు ఈ విధంగా చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేసి నెల రోజులు పూర్తికావడం వరి పంట ఏపుగా పెరిగిన సమయంలో నీటిలో మునిగిపోయిందని అంటున్నారు. వేట్లపాలెం సర్‌ప్లస్ వియర్ నుంచి వచ్చే నీరు వీకే రాయపురంలో పంట భూముల నుంచి ఇంద్రపాలెంలోని మురుగు కాలువ ద్వారా సముద్రంలోకి కలుస్తుంది.

మూడు రోజులుగా ఇంతే..

మూడు రోజులుగా వరి పంట నీటిలో మునిగి ఉంది. దీంతో పంట కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఇంద్రపాలెం వద్ద మురుగు కాలువలో నీటి ఉధృతంగా ఉండటంతో పొలాల్లోని నీరు బయటకు పోయే అవకాశం కనిపించడం లేదు. సామర్లకోట లాకుల గేట్లు ఎత్తివేయడం ద్వారా గోదావరి కాలువలో నీటిమట్టం తగ్గే అవకాశం ఉండగా తరచూ సర్‌ప్లస్ వియర్ గేట్లు ఎత్తి వేయడం ఎంత వరకూ సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రతిసారీ ఇలానే..



ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీకే రాయపురంలో పొలాలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. వర్షాలు వచ్చిన ప్రతి సమయంలోనూ వేట్లపాలెంలో సర్‌ప్లస్ వియర్ గేట్లు ఎత్తేస్తున్నారు. గోదావరి కాలువ ప్రమాదకర స్థాయిలో ఉంటే సామర్లకోట లాకుల వద్ద గేటు ఎందుకు ఎత్తడం లేదో అర్థం కావడం లేదు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ పరిష్కరించాలి.

– వెలమర్తి బుల్లిరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వీకే రాయపురం

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం



ముంపు సమస్యను ఇరిగేషన్ అధికారులే పరిష్కరించాలి. వీకే రాయపురంలో నీట మునిగిన పంట పొలాలపై తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాం. ఇరిగేషన్ అధికారికి ఫోన్ చేస్తే మీటింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తాం.

– వి.మురళీధర్, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట


లాకుల గేట్లు పనిచేయక..



గోదావరి కాలువలోని అదనపు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టడానికి సామర్లకోట లాకుల వద్ద ఏర్పాటు చేసిన గేట్లు పనిచేయడం లేదు. గోదావరి కాలువ పరిస్థితిని గమనించే సర్‌ప్లస్ వియర్ గేట్లు ఎత్తి నీటిని మురుగు కాలువ ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నాం.

–సైనీ, ఇరిగేషన్ జేఈ, సామర్లకోట

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామర్లకోటలో పంచారామ క్షేత్రం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన స్థానిక శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు వ్రతాలకు కావాల్సిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫొటో దాతలు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. దేవస్థానం నుంచి ప్రసాదం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వరలక్ష్మీ వ్రతాలకు వచ్చే మహిళలు కిలోన్నర బియ్యం, కలశ చెంబు, జాకెట్ ముక్క మాత్రమే తీసుకు రావాలన్నారు. పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లిస్తుందన్నారు. ఉదయం 9 గంటలకు సామూహిక వ్రతాలు ప్రారంభం అవుతాయని, భక్తులు 8.30 గంటలకు రావాలన్నారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తామని అన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘ నాయకులు

సామర్లకోట: ఈ నెల 2న జరిగిన తల్లి, ఇద్దరు పిల్లల హత్యపై బాధిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలని స్థానిక దళిత సంఘాలకు చెందిన నాయకులు గురువారం కాకినాడలోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. స్థానిక కోటపేటకు చెందిన తలే సురేష్ ప్రియురాలు ములపర్తి మాధురి (30) కుమార్తెలు పుష్పకుమారి (8), జెస్సీలోన (6)లను హత్య చేసిన విషయం విధితమే. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడు స్థానిక కోటపేటకు చెందిన తలే సురేష్‌ను ఈ నెల 7న అరెస్టు చేసి కోర్టుకు తరలించగా, రిమాండ్ విధించారు. మహిళతో పాటు ఇద్దరు చిన్నారులను అతికిరాతంగా హత్య చేసిన మానవ మృగానికి కఠిన శిక్ష పడే విధంగా సహకరించాలని దళిత నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ నుంచి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు లింగం శివప్రసాద్, పిట్టా జానకిరామారావు, గంటా కిరణ్, కాకర ప్రసాద్, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ కేంద్రం హెచ్చరికల మేరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి సూచించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన మండల స్థాయి అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలతో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలన్నారు. పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. శిథిలమైన ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో భోజన, తదితర వసతి ఏర్పాట్లపై జిల్లా అధికారుల నుంచి సూచనలు వస్తాయన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో దాతలు ముందుకు వస్తే వారి సహాయం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తితో..

పిఠాపురం: పట్టణంలో 79వ భారత స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణి ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీని నిర్వహించారు. స్వాతంత్య్రోద్యమం కోసం పోరాడిన వారి త్యాగాలు, చరిత్రలను గుర్తు చేసుకుంటూ ఈ ర్యాలీని చేపట్టామన్నారు. విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో జెండాలను ధరించి భారతదేశ పటం ఆకారంలో నిలబడి జాతీయ సమైక్యతా స్ఫూర్తిని చాటారు.

దైవభక్తిలో దేశభక్తి

పిఠాపురం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి సన్నిధిలో ఆలయ అర్చకులు విజయ జనార్దనాచార్యులు స్వామి వారిని జాతీయ జెండాలతో అలంకరణ చేసి తన దేశభక్తిని చాటుకున్నారు.

గొల్లప్రోలులో..

మండలంలోని స్థానిక బాలుర హైస్కూల్‌లో అమృత్ మహోత్సవంలో భాగంగా స్కూల్ పిల్లల సమక్షంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



నూకరాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఏ ఉద్యోగికైనా తాను ప్రజలకు చేసే సేవలతోనే గుర్తింపు లభిస్తుందని పోస్టుమాస్టర్ వరప్రసాద్ అన్నారు. స్థానిక సబ్ పోస్టాఫీస్ కార్యాలయంలో పోస్టుమాన్‌గా విధులు నిర్వహిస్తున్న జోకా నూకరాజు గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నూకరాజు దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పంచుకుంటున్న 'కూటమి'



రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధు తదితరులు

సామర్లకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ భూములను ఇష్టం వచ్చినట్లు పంచుకుంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకూ ప్రకాశం జిల్లా ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని, వాటిని జయప్రదం చేయాలన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల రద్దు, ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, కె.బోడకొండ, అర్జునరావు, సూరిబాబు, కిశోర్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కూచిపూడి నృత్య ప్రదర్శన

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళా మందిరంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు న్యూఢిల్లీకి చెందిన సీతానాగజ్యోతి, అభినయ నాగజ్యోతి, వారి శిష్యులు 10 మంది కూచిపూడి మార్గం పేరిట నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ప్రముఖ నాట్యాచార్య కృష్ణకుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారులు, కళాప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థులకు అందుతున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దాపురం: పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఏవై శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ పేరుతో అధికారులు పాఠశాల నిర్వహణ తీరు, విద్యార్థుల వసతి సౌకర్యాలు, రికార్డులు పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులతో సమావేశమై వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. రాయవరపు వీరబాబు, సత్య దంపతుల సేవలపై విద్యార్థులు, సిబ్బంది సంతృప్తికర సమాధానం ఇవ్వడంతో అధికారులు పాఠశాల నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ, ఏడీ మాట్లాడుతూ జిల్లాలో శాంతివర్ధన అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విభిన్న ప్రతిభావంతులకు మంచి వసతులు కల్పించి విశేష సేవలందిస్తున్న శాంతివర్ధన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ రూమ్‌ను ప్రారంభించి, విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు, స్పీచ్‌థెరపీ కిట్, నిర్మల బీమా పథకం కార్డులు, యోగాంధ్ర సర్టిఫికెట్లు చేతుల మీదుగా అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల ఏడీ కార్యాలయ పరిపాలనాధికారి యు.రాజు, సీహెచ్ శివరామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సత్య, ఏఓ వేణు, బాబి, శివ, అప్పలరాజు, విశాల, సరోజిని, శివ, రాజేంద్ర, దేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా బీఎల్వోల నియామకం

కాకినాడ రూరల్: ఇటీవల జరిగిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా కాకినాడ రూరల్ నుంచి బదిలీ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తగా 156 మంది బూత్ లెవల్ అధికారులను నియమించినట్లు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తెలిపారు. సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్పెషల్ ఇన్‌టెన్సివ్ సమ్మరీ రివిజన్ రాజకీయ పార్టీలు ఏజెంట్లను నియమించుకుని సమాచారం ఇవ్వాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు ఒక్కో పోలింగ్ బూత్ వద్ద 1,150 ఓటర్లు మించకుండా ఉండేందుకు రూరల్ నియోజకవర్గంలో కొత్తగా 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు మల్లిబాబు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్వో గాయత్రి, డీటీలు రావు కళ్యాణ్ చక్రవర్తి, సురేష్ కుమార్, ఆర్ఐ భవాని, రాజకీయ పార్టీల నాయకులు గౌతమ్, లింగరామయ్య, సాయిబాబు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, రాజా, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన

కొత్తపల్లి: మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎంపీ ఉదయ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉప్పాడ తీర ప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను బోటుపై వెళ్లి గురువారం పరిశీలించారు. సమస్యలపై మత్స్యకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మత్స్యకారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఉప్పాడ తీరప్రాంతంలో వేసిన జియోట్యూబు రక్షణ గోడ పూర్తిగా ధ్వంసం కావడంతో ఇళ్లు కోతకు గురవుతున్నాయన్నారు. రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. హార్బర్ నిర్మాణ పనులు మత్స్యకారులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. తీరప్రాంత రక్షణ, శాశ్వత రక్షణ గోడ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పలువురు మత్స్యకార నాయకులు, అమీనబాద్ సర్పంచ్ మణికంఠ, జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు కాని జనసేన నేతలు

ఎంపీ ఉప్పాడ హార్బర్ నిర్మాణ పనులు పరిశీలనా కార్యక్రమానికి జనసేనకి చెందిన కీలక నేతలు, టీడీపీకి చెందిన మత్స్యకార నాయకులు ఏ ఒక్కరూ హాజరుకాలేదు. వారికి కార్యక్రమానికి సంబంధించి ఎంపీ వర్గానికి చెందిన జనసేన నాయకులు, మత్స్యశాఖ అధికారులు సమాచారం ఇవ్వకపోవడం వల్లే హాజరుకాలేదని చెప్పుకుంటున్నారు.

రండి.. ఆర్మీలో చేరుదాం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దేశ రక్షణపై ఆసక్తి ఉండి ఆర్మీలో చేరాలనుకునే వారికి ఇదో సదవకాశం.. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ వారికి బంగారు భవిష్యత్తును అందిస్తుంది. ర్యాలీలో నిర్వహించే వివిధ పరీక్షల పట్ల అవగాహన లేకపోవడం, సరైన సాధన చేయకపోవడంతో తొలి దశ పరుగులోనే చాలామంది వెనక్కి వస్తున్నారు. ఇక్కడ విజయం సాధించాలనుకునే అభ్యర్థులకు ర్యాలీ నిర్వహించే విధానంపై అవగాహన అవసరం. దేశ రక్షణలో భాగస్వాములయ్యే అగ్నివీర్, జనరల్, టెక్నికల్, స్టోర్ కీపర్ ఉద్యోగాలకు కాకినాడ డీఎస్ఏలో ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకూ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షణలో రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ బ్రిగేడియర్ రాకేష్‌శర్మ నిర్వహిస్తున్నారు. ఇందులో అభ్యర్థుల ఎంపికకు తొలిమెట్టుగా 1.6 కిలోమీటర్ల పరుగు పందేన్ని నిర్వహిస్తున్నారు. ఈ పరుగును 6.30 నిమిషాల్లో పూర్తి చేయాలి. 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేసిన వారిని గ్రూప్–1గా, 5.45 నిమిషాల్లో పూర్తి చేసిన వారిని రెండో గ్రూప్‌గా ఎంపిక చేస్తారు. పరుగులో ఉత్తీర్ణులైన వారికి పులప్స్, 9 ఫీట్ డిచ్, జిగ్‌జాక్ బ్యాలెన్స్ వాక్‌ను నిర్వహిస్తారు.

పరుగు పరీక్ష..

వంద మార్కులకు నిర్వహించే పరీక్షలో 60 మార్కులు పరుగుకు, 40 మార్కులు పులప్స్ కేటాయిస్తారు. పరుగులో 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేసిన వారికి 60 మార్కులు, 5 నిమిషాల పైబడి పూర్తి చేసిన వారికి 48 మార్కులు కేటాయిస్తారు. పులప్స్‌లో 10 చేసిన వారికి 40 మార్కులు, 9 చేసిన వారికి 30 మార్కులు, 8 చేసిన వారికి 27 మార్కులు కేటాయిస్తారు.

భౌతిక పరీక్షలకు కావాల్సినవి..

శరీర దృఢత్వం, అప్పర్ బాడీ స్ట్రెంత్, ఫిట్‌నెస్ సంబంధించిన వ్యాయామాలు, సరైన పౌష్టిక ఆహారంపై దృష్టి సారించాలి. సరిపడినంత విశ్రాంతి అవసరం. కళ్లు, చెవుల వినికిడి సామర్థ్యం, డెంటల్ హెల్త్ నిర్వహిస్తారు.

అర్హులు ఎవరంటే..

అభ్యర్థుల వయసు 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులు. జనరల్ డ్యూటీకి పదో తరగతి, టెక్నికల్‌కు 12వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

నీట మునిగిన వరి, పత్తి



గొల్లప్రోలు జగనన్న కాలనీ వద్ద సుద్దగడ్డ ఉధృతి



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: మండలంలో అధిక వర్షం కురవడంతో గొల్లప్రోలు రైతాంగానికి కష్టాలు మొదలయ్యాయి. ఇటీవల నీరు అందక నాట్లు పడక ఇబ్బందులు పడ్డ రైతులు.. నేడు వరద బారిన పడి పంటలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. భారీ వర్షాలతో సుద్దగడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో సుద్దగడ్డ పరివాహక ఆయకట్టు భూములు నీట మునుగుతున్నాయి. రెండు రోజులుగా 71.33 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వడంతో సుద్దగడ్డకు వరద వచ్చి గొల్లప్రోలు మండల పరిధిలోని 650 హెక్టార్లలో వరి, 60 హెక్టార్లలో పత్తి పంటలు నీట మునిగాయని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం వరద ఎక్కువగా ఉండటంతో మరిన్ని పంటలు మునిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోడ్డుపైకి చేరిన నీరు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో వీకే రాయపురం – మాధవపట్నం మధ్యలో గురువారం సాయంత్రం రోడ్డుపైకి నీరు చేరింది. వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వీకే రాయపురం సమీపంలో గోదావరి కాలువపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దాంతో వంతెన పనులకు అంతరాయం కలగకుండా గోదావరి కాలువకు అడ్డుకట్ట వేయడంతో గోదావరి కాలువలో నీరు రోడ్డుపై చేరింది. కాకినాడ రోడ్డులో అడుగడుగునా గోతులు ఉండటంతో వాహనచోదకులు రాత్రి సమయంలో అవస్థలు పడ్డారు.